క్లుప్తంగా

పార్కులో స్పెషల్ డ్రైవ్



పార్కు పరిసరాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ నాయుడు తదితరులు

అమలాపురం టౌన్: స్థానిక చంద్రబాబు ఆరోగ్య ఉద్యానవనం(పార్కు)లో సందర్శకుల సౌకర్యార్థం క్లీనింగ్ కోసం స్పెషల్ డ్రైవ్ పనులను మంగళవారం చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు మంగళవారం సాయంత్రం పార్కును సందర్శించి పనులను పరిశీలించారు. పార్కును రూ.9 లక్షలతో అభివృద్ధి చేసేందుకు టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయిందని, త్వరలోనే పనులు మొదలుపెడతామని చెప్పారు. పార్కులో మరిన్ని మొక్కలు నాటడంతో పాటు పాడైపోయిన పిల్లల ఆట బొమ్మలకు మరమ్మతులు చేయిస్తామన్నారు. కమిషనర్ వెంట వైఎస్సార్ సీపీ నాయకుడు యండమూరి శ్రీను ఉన్నారు.

27న క్లస్టర్ లెవల్ స్పోర్ట్స్, ఎగ్జిబిషన్ మీట్

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలోని మెట్టకూరు జవహర్ నవోదయ విద్యాలయలో క్లస్టర్ లెవల్ స్పోర్ట్స్ అండ్ ఎగ్జిబిషన్ మీట్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ టీవీ ప్రకాశరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, గౌరవ అతిథిగా ఆర్ఏఓ హాజరుకానున్నారన్నారు. 28న జరిగే ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, గౌరవ అతిథిగా ఎస్పీ రఘునాయగం హాజరు కానున్నారని తెలిపారు.

వీరేశ్వరుని సన్నిధిలో జిల్లా జడ్జి



జిల్లా జడ్జి గంధం సునీత దంపతులకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ పండితులు

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల వీరేశ్వరస్వామిని జిల్లా ప్రిన్సిపల్, సెషన్స్ జడ్జి గంధం సునీత(రాజమహేంద్రవరం) దంపతులు మంగళవారం దర్శించుకున్నారు. వారికి పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం జడ్జి దంపతులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకస్వామి దత్తు, పండితులు నాగాభట్ల శ్రీరాంలు వారికి స్వామివారి చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదం ఇచ్చి సత్కరించారు.

మణిపూర్ ఘటనపై అమలాపురంలో నేడు నిరసన

మండపేట: మణిపూర్‌లో మహిళలను వివస్త్రలు చేసి, అత్యాచారం చేసిన ఘటనను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అమలాపురంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి ప్రజలు సంఘీభావం తెలిపేందుకు తరలి రావాలని కామన కోరారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో హేమంత్ ప్రతిభ



హేమంత్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

అమలాపురం టౌన్: ఇటీవల రామచంద్రపురంలో జరిగిన 8వ సబ్ జూనియర్స్ రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో విజయం సాధించిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జట్టులో క్రీడాకారుడైన అమలాపురానికి చెందిన వీరమల్లు హేమంత్ ప్రతిభ చాటాడు. స్థానిక విద్యానిధి స్కూలులో తొమ్మిదో తరగతి చదువుతున్న హేమంత్ తండ్రి వీరమల్లు నరసింహారావు వ్యాయామ ఉపాధ్యాయుడు కావడంతో తన కుమారుడిని ఆ క్రీడలో నైపుణ్యం సాధించేలా తర్ఫీదు ఇచ్చారు. హేమంత్‌కు విద్యానిధి స్కూలులో మంగళవారం సాయంత్రం అభినందన కార్యక్రమం జరిగింది. హేమంత్‌ను విద్యా నిధి సంస్థల చైర్మన్ ఏబీ నాయుడు, కరస్పాండెంట్ శ్యామల మహాలక్ష్మి, పిన్సిపాల్స్ టీఎస్ మాధవి, ఆంటోని, ఉపాధ్యాయులు ప్రశంసించారు.

మేకల దొంగల అరెస్ట్

కాట్రేనికోన: మండలంలో కుండలేశ్వరంలో సోమవారం అర్ధరాత్రి మేకలను దొంగిలించిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. కాట్రేనికోన ఎస్ఐ టి.శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం అడవిపేటకు చెందిన గిడ్ల చంటి, ఎస్.కొత్తపల్లికి చెందిన పెయ్యల సురేష్‌లు కుండలేశ్వరం పంచాయతీలో మందపాటి వెంకటేశ్వరరావుకు చెందిన మేకల పాకలో మేకలను దొంగిలించే ప్రయత్నం చేశారు. మేకల అరుపులు విని యజమాని బయటకు వచ్చి చుట్టుపక్కల వారిని పిలిచి వారిద్దరినీ పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మందపాటి వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఇద్దరిని అరెస్టు చేశామని ఎస్ఐ టి.శ్రీనివాస్ తెలిపారు.


చరిత్రకు చిహ్నాలు.. బాస్టిల్ డే జ్ఞాపకాలు..

- యానాంలో చెక్కు చెదరని షోల్‌షేర్, మరియన్నె విగ్రహాలు
- ఫ్రెంచ్ పాలనా కాలంలో 136 ఏళ్ల క్రితం ఏర్పాటు

యానాం: 1789 జులై 14.. ఫ్రెంచి విప్లవాన్ని మలుపుతిప్పిన రోజది. వేలాదిమంది ఖైదీలు బాస్టిల్ ద్వారాలను బద్దలు కొట్టుకుని స్వేచ్ఛా వాయువులు పీల్చారు. అనంతరం బాస్టిల్ కోటలో ఉన్న గన్ పౌడర్, ఆయుధ సంపత్తిని స్వాధీనం చేసుకుని నేషనల్ అసెంబ్లీని ఏర్పాటుచేసుకుని స్వాతంత్ర్యం సంపాదించుకున్నారు. బాస్టిల్ కోట ధ్వంసం ఘటనపై అప్పట్లో యానాంలో సైతం సంబరాలు జరిగాయి. ఆ రోజును బాస్టిల్ డేగా పిలుచుకుంటారు. ఇటీవల ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఫ్రాన్స్ వెళ్లి బాస్టిల్ డేలో ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. వాస్తవానికి యానాంలోనూ బాస్టిల్ డే గుర్తులున్నాయన్న సంగతి చాలామందికి తెలియదు.

విజయోత్సవాన్ని స్మరించుకుంటూ

బాస్టిల్ డే విజయోత్సవాన్ని స్మరించుకుంటూ 1887, జులై 14 ఫ్రెంచి జాతీయదినోత్సవం రోజున యానాంలో ఇద్దరు ప్రముఖుల విగ్రహాలు ఏర్పాటుచేశారు. సదరు రెండు విగ్రహాలు బాస్టిల్ డే చారిత్రక ప్రాముఖ్యతను తెలియజేస్తుంటాయి. ముఖ్యంగా ఆ రెండు విగ్రహాల్లో ఒకరు మారియన్నె, మరొకరు షోల్‌షెర్(విక్టర్). మారియన్నె విగ్రహం యానాం ఆర్ఏఓ భవనంలో ఉంటే, షోల్‌షెర్(విక్టర్) విగ్రహం యానాం మున్సిపాలిటీ భవనంలో ఉంది. యానాం మున్సిపల్ హాలులో జరిగిన సమావేశంలో బానిసత్వ నిర్మూలన కోసం, నల్లజాతీయుల హక్కుల కోసం పోరాడిన ఫ్రెంచి రచయిత విక్టర్ షోల్‌షెర్ విగ్రహాన్ని నెలకొల్పారు. ఆయన జనాల్ని చైతన్యపరిచి వారి అభిమానం పొంది విక్టర్‌గా పిలువబడ్డాడు. అదేవిధంగా స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వానికి చిహ్నంగా ఫ్రెంచి జాతీయ చిహ్నం ఒక సాధారణ వనిత మరియన్నె విగ్రహాన్ని ఆర్ఏఓ భవనంలో ఫ్రెంచి కాలంలోనే నెలకొల్పారు. ఆనాడు మరియన్నె విగ్రహాన్ని స్థానికులు గొల్లభామగా పిలుచుకునేవారని చరిత్ర ద్వారా తెలుస్తుంది. ఈ రెండు విగ్రహాలను అప్పటి ఫ్రెంచి పెద్దొర మిస్టర్ ఎమ్ లీ ఆవిష్కరించారు. ఆరోజు సమావేశానికి హాజరైన ప్రజలు లాంగ్‌లివ్ షోల్‌షెర్, లాంగ్‌లివ్ రిపబ్లిక్ అని నినాదాలు చేశారని చారిత్రక పుస్తకాల ద్వారా తెలుస్తుంది.



యానాం ఆర్ఏఓ భవనంలో ఉన్న చారిత్రక మరియన్నె విగ్రహం



మున్సిపల్ కార్పొరేషన్ భవనంలో ఉన్న విక్టర్ షోల్‌షెర్ విగ్రహం

ఓఎన్‌జీసీ పరిహారం మత్స్యకారులందరికీ ఇవ్వాలి



ఓఎన్‌జీసీ పరిహారంపై ఆర్ఏఓ మునిస్వామితో చర్చిస్తున్న ఎమ్మెల్యే అశోక్

ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్

యానాం: ఆంధ్రప్రదేశ్‌లో ఇచ్చిన విధంగానే మత్స్యకారులందరికీ ఓఎన్‌జీసీ నష్టపరిహారం ఇవ్వాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ స్పష్టం చేశారు. మంగళవారం ఓఎన్‌జీసీ పరిహారం పంపిణీ జాబితా తదనంతర పరిణామాలపై ఆర్ఏఓ మునిస్వామి, మత్స్యశాఖ ఏడీ దడాల గొంతియ్య తదితరులతో ఆయన సమావేశమై చర్చించారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో తయారుచేసిన నష్టపరిహారం పంపిణీ నిబంధనలనే యానాంలోనూ అమలుచేయాలని, లేదంటే ఏ పోరాటానికైనా తాను సిద్ధమని ఆయన హెచ్చరించారు. తక్షణం అర్హుల జాబితా తయారుచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మత్స్యకార నాయకులు మోదే హరిశ్చంద్ర, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

ముమ్మిడివరం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షానికి మండలంలోని లోతట్టు ప్రాంతాలు, రహదారులు జలమయమయ్యాయి. ముమ్మిడివరం సినిమాహాలు రోడ్డు, హాస్పటల్ రోడ్డు, జీఎంసీ బాలయోగి కాలనీ, కంసాల గరువు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. ముమ్మిడివరం–అయినాపురం ఆర్అండ్‌బీ రోడ్డులో భారీగా వర్షపు నీరు చేరడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎడతెరిపి లేని వర్షాలతో ఖరీఫ్ పనులకు అంతరాయం ఏర్పడింది. నారుమడులు నీట మునిగాయి. గోదావరి వరద నిలకడగా ఉన్నా లోతట్టు లంక గ్రామాలు ఇంకా వరద నీటిలోనే ఉన్నాయి.

అపరిశుభ్ర ప్రదేశాల్లో స్వచ్ఛభారత్ బోర్డులు



స్వచ్ఛ భారత్ బోర్డుల వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి, కౌన్సిలర్లు

అమలాపురం టౌన్: స్థానిక 22వ వార్డులో అపరిశుభ్రంగా ఉన్న ప్రదేశాల్లో ప్రజలను చైతన్యపరిచే దిశగా జీఎస్ఎన్ ట్రావెల్స్ సంస్థ స్వచ్ఛ భారత్ బోర్డులను మంగళవారం ఏర్పాటుచేసింది. ఈ బోర్డుల ఏర్పాటు కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి మాట్లాడుతూ పట్టణ ప్రజలు స్వచ్ఛభారత్ మార్గ దర్శకాలను పాటిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ గొవ్వాల రాజేష్, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, కౌన్సిలర్ చిట్టూరి పెదబాబు, పార్టీ నాయకులు యండమూరి శ్రీను, రెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వేట నష్ట పరిహారం ఇవ్వాలంటూ నిరసన

యానాం: స్థానిక నియోజకవర్గ పరిధిలో చమురు సంస్థల ద్వారా మత్స్యకారులకు వచ్చిన నష్టపరిహారం సొమ్ము అర్హులందరికీ చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక ఆర్ఏఓ ఆఫీసు ఎదుట మత్స్యకార నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేలాది కుటుంబాలు చేపల వేటనే నమ్ముకుని జీవనం సాగిస్తున్నారని, అయితే అర్హులను లబ్ధిదారుల జాబితా నుంచి తొలగించడం అన్యాయమన్నారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో నాలుగుసార్లు చమురు సంస్థల ద్వారా వచ్చిన వేట నష్టపరిహారాన్ని పంపిణీ చేశారని, యానాంలో మాత్రం ఒకసారి మినహా మళ్లీ చెల్లించలేదన్నారు. అనంతరం ఆర్ఏఓ మునిస్వామికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు మల్లాడి సత్తిబాబు, దినేష్, పోసియ్య తదితరులు పాల్గొన్నారు.



యానాంలో ధర్నా చేస్తున్న మత్స్యకార నాయకులు

అక్రమంగా తవ్విన చెరువులను తొలగించాలి

ఉప్పలగుప్తం: మండలంలోని ఎస్.యానం గ్రామం అయితాబత్తుల వారి సెంటర్‌లో ఉన్న దళిత కుటుంబాలను ఆనుకొని అక్రమంగా తవ్విన ఆక్వా చెరువుల సాగును నిలిపివేయాలని గ్రామస్తులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. చెరువుల్లో ఉపయోగించే రసాయనాల వల్ల అనారోగ్యాల పాలవుతున్నామని, భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ ఆదేశాలను అమలు చేసి మత్స్యశాఖ, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నువుంద్రు ఆనంద్, ముత్యాలు, ఎస్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఎస్.యానం గ్రామస్తులు

రోగులను సురక్షిత ప్రాంతాలకు తరలించండి

అయినవిల్లి: రోగులను, గర్భిణులను వరద ప్రభావిత ప్రాంతాలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఎం.దుర్గారావు దొర వైద్య సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని వరద గ్రామాలైన అయినవిల్లిలంక, చింతనలంక, మడుపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను సందర్శించారు. గ్రామంలో ఉన్న గర్భిణులు, బాలింతలు, బెడ్ రిడెన్ రోగులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. వరద గ్రామాల్లోని ప్రజలు కాచి చల్లార్చిన నీరు తాగాలని, జ్వరాలు బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జ్వరాల బారిన పడ్డవారు, రక్త పరీక్ష చేయించుకుని వైద్యుల సూచించిన మందులు వాడాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాలను రోజూ ఏఎన్ఎం, ఆశావర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు సందర్శించి వైద్య సేవలు చేయాలని ఆదేశించారు. అనంతరం అయినవిల్లి పీహెచ్‌సీని విజిట్ చేసి వైద్య సేవలు పరిశీలించారు. రికార్డులను పరిశీలించారు. రోగులకు మెరుగైన సేవలు అందివ్వాలని, అన్ని సేవలను ఆన్‌లైన్ చేయాలని, ప్రసవాల సంఖ్యను పెంచాలని వైద్యాధికారి మంగాదేవికి సూచించారు. ఆయన వెంట సీహెచ్‌ఓ రాంబాబు, ఎంపీహెచ్‌ఈఓ ఆర్.రామకృష్ణమూర్తి, వైద్య సిబ్బంది ప్రసాద్ తదితరులు ఉన్నారు.



మడుపల్లిలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఎం.దుర్గారావు దొర

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

మామిడికుదురు: విద్యార్థులు పట్టుదలతో ఆడి క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అభిలాషించారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ సహకారంతో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో గత నెలలో పలువురికి బాక్సింగ్‌లో శిక్షణ ఇచ్చారు. నగరంలో మంగళవారం ఎమ్మెల్యే స్వగృహం వద్ద జరిగిన సమావేశంలో బాక్సింగ్‌లో శిక్షణ పొందిన క్రీడాకారులకు చిట్టిబాబు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవయువ క్రీడా యువజన సేవా సంఘం ద్వారా ఏటా ఔత్సాహికులకు బాక్సింగ్‌లో శిక్షణ ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులను ఎమ్మెల్యే చిట్టిబాబు అభినందించారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి బొంతు మధుకుమార్, క్యాంప్ ఆర్గనైజర్ బొంతు చంద్రశేఖర్, లంకే ఏసు పాల్గొన్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

చోరీకి విఫలయత్నం

పి.గన్నవరం: స్థానిక అక్విడెక్టు వద్ద వేంచేసిన షిర్డీ సాయిబాబా వారి ఆలయంలో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి చోరీకి ప్రయత్నించి, విఫలమయ్యాడు. తలుపులు తెరుచుకోక పోవడంతో పలాయనం చిత్తగించాడు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అవ్వకుండా, వాటిని పక్కకు తిప్పాడు. అయితే బాబా ఆలయంలోకి దొంగ ప్రవేశించిన దృశ్యాలు పక్కనే ఉన్న పంచ ముఖ ఆంజనేయ స్వామి ఆలయ సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. బాబావారి ఆలయం తలుపులు బద్దలు గొట్టి ఉండటాన్ని గమనించిన కమిటీ సభ్యులు మంగళవారం ఉదయం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించారు. ఆంజనేయ స్వామి ఆలయ డిబ్బీని పగలగొట్టి రూ.5000, పక్కనే ఉన్న కూరగాయల షాపులోని కొంత నగదును గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేశాడు. ఆ దృశ్యాలు కూడా రికార్డు అయ్యాయి. అక్కడ చోరీకి పాల్పడిన వ్యక్తి షిర్డీ సాయిబాబా ఆలయం తలుపులు పగులగొట్టినట్టు భావిస్తున్నారు. వరుసగా దొంగతనాలు జరుగుతుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి కుటుంబానికీ సంక్షేమంతో భరోసా



లబ్ధిదారులకు సర్టిఫికెట్‌లను అందిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్



జి.మూలపాలెంలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ రాణి మిరియం జ్యోతి



పటవలలో మహిళకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఎంపీపీ రాయుడు సునీత

అల్లవరం: ప్రతి కుటుంబానికీ సంక్షేమంతో భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. ఓడలరేవు, కొమరగిరిపట్నం–3 సచివాలయాల్లో సర్పంచ్‌లు మల్లాడి మంగాయమ్మ, రాకాపు విజయలక్ష్మిల అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమాలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఎంతో పారదర్శకంగా, వేగంగా సంక్షేమ పథకాలకు అవసరమైన ధ్రువపత్రాలను ఉచితంగా అందజేస్తున్నామని చెప్పారు. అనంతరం సురక్ష సర్టిఫికెట్‌లను ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, గృహసారథుల మండల కన్వీనర్ తిక్కా ప్రసాద్, ఎంపీటీసీ పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, పాల శ్రీలక్ష్మి, సొసైటీ చైర్మన్ గుర్రం బాబులు, డైరెక్టర్లు బొంతు సత్యనారాయణ, పులుసుగంటి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'జగనన్న సురక్ష'

ఐ.పోలవరం: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి అన్నారు. మండలంలో జి.మూలపాలెం సచివాలయంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమ సభలో ఎంపీపీ పాల్గొని మాట్లాడుతూ అర్హులై ఉండి ఏఒక్కరూ లబ్ధి అందకుండా మిగిలిపోకూడదన్న ఉద్దేశంతోనే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని తీసుకొచ్చారన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అనంతరం లబ్ధిదారులకు ఉచితంగా ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, సర్పంచ్ మందపాటి విజయలక్ష్మి, కోయిరాజు, కాటం సత్తిరాజు, పెమ్మాడి వెంకటసత్తిరాజు, కాటం కోయిలక్ష్మి, రేవు అప్పారావు, సూరపరాజు తదితరులు పాల్గొన్నారు.

973 మందికి ధ్రువీకరణ పత్రాల పంపిణీ

తాళ్లరేవు: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సమస్యలు సత్వరం పరిష్కారమవుతాయని ఎంపీపీ రాయుడు సునీత అన్నారు. మంగళవారం పటవల పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పినపోతు చిన కామేశ్వరరావు అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సునీత మాట్లాడుతూ దీర్ఘకాలంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. అనంతరం 973 మందికి ఉచితంగా పలు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జేవీ రమణమ్మ, ఎంపీడీఓ ఎం.అనుపమ, వీఆర్వో రమణ, కొప్పిశెట్టి వెంకట్, రాయుడు గంగాధర్, కాలా వెంకటరమణ, లక్ష్మణ్, చందు, అప్పారావు, సత్తిబాబు పాల్గొన్నారు.

ప్రాచీన కళా సంయోజకులుగా పుత్సా



పుత్సా కృష్ణ కామేశ్వర్

అమలాపురం టౌన్: అమలాపురం భూపయ్య అగ్రహారానికి చెందిన పుత్సా కృష్ణ కామేశ్వర్ సంస్కార భారతి ప్రాంత ప్రాచీన కళా సంయోజకులుగా నియమితులయ్యారు. గత రెండున్నర దశాబ్దాలుగా పురాతన నాణేలు, కరెన్సీ నోట్లు, తపాలా బిళ్లల సేకరణకర్తగా కృష్ణ కామేశ్వర్ గుర్తింపు పొందారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా గోవా, హిమచల్ ప్రదేశ్ వంటి ప్రాంతాల్లో అనేక ప్రదర్శనలు ఏర్పాటుచేసి ప్రాచీన కళా రంగానికి సేవలు అందిస్తున్నందుకు ఆయనకు సంస్కార భారతి ఈ బాధ్యతలు అప్పగించింది. కృష్ణ కామేశ్వర్ నియామకంపై సంస్కార భారతి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు ఆకొండి పవన్‌కుమార్, ఉపాధ్యక్షుడు గాడేపల్లి సత్యనారాయణమూర్తి, శ్రీగిరి పద్మావతి, కార్యదర్శి గోటేటి గంగాధరరావు, వేదనభట్ల సాయి లక్ష్మి హర్షం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ స్కూళ్లలో చదివితే పది శాతం రిజర్వేషన్

యానాం: పుదుచ్చేరి, యానాం, మాహే, కారైకల్‌ల్లో ప్రభుత్వ స్కూళ్లలో చదివిన విద్యార్థులకు ఎంబీబీఎస్, బీడీఎస్, బీఏఎంఎస్(ఆయుర్వేద) మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి 10 శాతం రిజర్వేషన్ల అమలుకు సీఎం రంగసామి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ స్కూళ్లలో చదివినవారికి 37 ఎంబీబీఎస్ సీట్లు, 11 బీడీఎస్ సీట్లు, 4 బీఏఎంఎస్ సీట్లు వస్తాయన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లోనైతే పుదుచ్చేరి–10 సీట్లు, కారైకల్–2, మాహే–1, యానాం–1 సీట్లు వస్తాయన్నారు.

పరిశోధనలపై అవగాహన సదస్సు

కాట్రేనికోన: స్థానిక చెయ్యేరు శ్రీనివాసా స్వయం ప్రతిపత్తి ఇంజినీరింగ్ కళాశాలలో పరిశోధనలపై అధ్యాపకులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమాన్ని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డీవీఎస్ఎస్ వర్మ ప్రారంభించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ న్యూఢిల్లీకి చెందిన డాక్టర్ డీఆర్ ప్రసాదరాజు మాట్లాడుతూ విద్యార్థులు చేపడుతున్న పరిశోధనలకు కావలసిన నిధులు ప్రభుత్వ సంస్థల నుంచి ఎలా సమకూర్చుకోవాలో వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్‌వీఎస్ పరమేశ్వరరావు, రమేష్ రాజు, సందీప్, డాక్టర్ బి.రత్నరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణం కోసం ఆక్వా రైతుల వినతి

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు గొల్లలరేవు బ్రిడ్జి నుంచి ఊటకాలువ వరకూ గల రహదారిని నిర్మించాలని ఆక్వా రైతులు ఎంపీపీ రాయుడు సునీతను కోరారు. మంగళవారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో ఆక్వా ప్రతినిధి బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో రైతులు ఎంపీపీని కలిసి పాడైన రహదారి వల్ల పడుతున్న ఇబ్బందులను వివరించి వినతి పత్రం అందజేశారు. ఎంపీపీ సునీత స్పందించి రూ.2 లక్షలు మంజూరు చేయడంతో పాటు తక్షణమే పనులు ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో ఆక్వా రైతులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రచ్చ ముత్యాలు, పటవల మాజీ సర్పంచ్ సూరిబాబు, బొక్కా రాంబాబు, వేలూరి శ్రీనివాస్, చిలుకూరి సుబ్బారాయుడు, రచ్చ అప్పారావు, బొడ్డువాని లంక గ్రామ రైతులు ఉన్నారు.



ఎంపీపీ రాయుడు సునీతకు వినతి పత్రం అందజేస్తున్న ఆక్వా రైతులు

కాలువలో పడిన పాల వ్యాను

ఉప్పలగుప్తం: మండలంలోని వానపల్లిపాలెంలో పాల వ్యాను అదుపుతప్పి కాలువలోకి జారిపోయింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో కొన్ని రోజుల క్రితం పంచాయతీ సిబ్బంది కుళాయి మరమ్మత్తు కోసం పెద్ద కాలువను ఆనుకుని రోడ్డు అంచున గొయ్యి తీసి దాన్ని అలాగే వదిలేశారు. మంగళవారం ఉప్పలగుప్తం వైపు వెళుతున్న పాల వ్యాను ఎదురుగా వచ్చే వాహనానికి దారి ఇవ్వబోయి గోతిలో దిగబడింది. అనంతరం వాహనం అదుపుతప్పి పంట కాలువలోకి తిరగబడింది. బండిలో ఉన్న పాల క్యానులను వేరే వాహనానికి తరలించి, జేసీబీ, ట్రాక్టర్ సహాయంతో స్థానికులు వాహనాన్ని బయటకు తీశారు. ప్రమాదంలో డ్రైవరు అదృష్టవశాత్తూ సురక్షితంగా బయటపడ్డాడు. ఇప్పటికైనా పంచాయతీ సిబ్బంది గొయ్యిని పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.



వానపల్లిపాలెంలో కాలువలో నుంచి వ్యానును బయటకు తీస్తున్న దృశ్యం

మణిపూర్‌లో దాడులు అరికట్టాలి



అమలాపురంలో ధర్నా చేస్తున్న వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు

అమలాపురం టౌన్: మణిపూర్‌లో జరుగుతున్న అహింస, దాడులను తక్షణమే అరికట్టేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ అమలాపురం గడియారం స్తంభం సెంటరులో వామ పక్షాలు, యూటీఎఫ్, పలు ప్రజా సంఘాల ప్రతినిధులు మంగళవారం సాయంత్రం ధర్నా నిర్వహించారు. మణిపూర్‌లో మహిళలపై అరాచకాలు, అత్యాచారాలు అరికట్టాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, సీపీఎం జిల్లా నాయకుడు కారెం వెంకటేశ్వరరావు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పెంకే సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఎస్.జ్యోతిబసు, కొంకు రాజామణి, కె.శంకర్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

మణిపూర్ ముఖ్యమంత్రితో రాజీనామా చేయించాలి

ముమ్మిడివరం: మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న అల్లర్లపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందించి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రితో రాజీనామా చేయించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి మణిపూర్ దారుణ కాండను ఖండించారు. అనంతరం ఈ మేరకు డిప్యూటీ తహసీల్దార్ వై.రాంబాబుకు వినతి పత్రాన్ని సమర్పించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి గుదే దుర్గాప్రసాద్, మండల అధ్యక్షుడు నిమ్మకాయల వెంకటేష్, కార్యదర్శి జి.బేబీ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సఖిలే సూర్యనారాయణ, పాము బాలయ్య తదితరులు పాల్గొన్నారు.